
కథానిక.

# సాహసి

-రంకిరెడ్డి చంద్రశేఖర్



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా గత రెండు రోజుల నుంచీ ఒకటే వర్షాలు కురుస్తున్నాయి. మూడో రోజు కూడా పరిస్థితిలో మార్పేమీ లేదు సరికదా వాయుగుండం మరింత ఉధృతమవడంతో ఉదయం నుంచీ ఆకాశం అంతా మబ్బులు కమ్మేసింది. ఆ వెంటనే ఆకాశం చిల్లులు పడినట్లుగా వర్షం కుండపోతగా కురిసింది. అయితే మధ్యాహ్నం నుంచీ వర్షం కాస్త తెరపి ఇవ్వడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షం తగ్గినా ఈదురు గాలులు మాత్రం వీస్తూనే వున్నాయి.

రెండు రోజుల నుంచీ విశాఖపట్నం వెళ్లాల్సిన హరీంద్ర వర్షం కారణంగా తన ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నాడు. వర్షం శాంతించడంతో హడావుడిగా ప్రయాణమయ్యాడు. ఏదోలా కోటిపల్లి గోదారి రేవు దాటి అవతలికి వెళ్లిపోవాలి. రేవు దాటితే విశాఖపట్నం వెళ్లడం పెద్ద సమస్య కాదు అనుకొంటూ హరీంద్ర సూట్‌కేస్ సర్దుకొని గబగబా బస్టాండ్‌కి బయలుదేరాడు. ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఎం.టెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న హరీంద్ర చదువులో ఎంత తెలివైన విద్యార్థో ఆటలలో అంతకంటే ప్రతిభా సామర్థ్యాలు కలవాడు. ఇంజనీరింగ్ కాలేజీ క్రికెట్ టీమ్ కెప్టెన్ ఇతనే. ముఖ్యంగా చిన్నప్పట్నించీ గోదావరి ఒడ్డున పెరగడంతో స్విమ్మింగ్ పోటీలలో చాలాసార్లు మెడల్స్ సంపాదించాడు. అమలాపురం బస్టాండ్ చేరుకొనే సరికి ముక్తేశ్వరం గోదావరి ఒడ్డుకి వెళ్లడానికి బస్సు సిద్ధంగా వుంది. ముక్తేశ్వరం బస్సెక్కి గోదావరి ఒడ్డుకి చేరుకున్నాడు.


రెండు రోజులుగా వర్షాలు కురుస్తూ వాతావరణం బాగోలేకపోవడం వల్ల రేవులో పెద్దగా జనం లేరు. జనం లేకపోవడంతో లాంచీలు కూడా తిరగడం మానేసాయి. బస్సులోంచి ప్రయాణీకులు క్రిందకి దిగారో లేదో వున్నట్లుండి ఆకాశం మళ్లా మబ్బులతో కమ్మేసింది. శాంతించాడను కొన్న వరుణదేవుడు తన ప్రతాపాన్ని చూపడానికి సిద్ధం అవడంతో వర్షపు జల్లులు ప్రారంభమయ్యాయి. ఈదురుగాలులు మరింతగా ఎక్కువయ్యాయి. వర్షం మరింత ఎక్కువ కాకముందే అవతలి ఒడ్డుకు చేరుకోవాలనుకొన్న ఆతృతతో హరీంద్రతో సహా రేవులో వున్న పది హేను మంది గబగబా ఒడ్డున వున్న పడవ ఎక్కేసారు. తెరచాప వేయడంతో పడవ గోదావరిలో రాకెట్‌లా దూసుకుపోతోంది. ఆకాశం అంతా దట్టమైన మబ్బులతో నిండిపోవడంతో అప్పుడే చీకటి పడిపోయినట్లుగా వుంది. ఆ మబ్బులు ఎంత దట్టంగా వున్నాయంటే ఆడవాళ్లు కళ్లకు పెట్టుకొనే కాటుక కన్నా నల్లగా వున్నాయి. చూస్తుండగానే వర్షం కుండపోతగా కురుస్తోంది. భయంకరమైన ఉరుములు, మెరుపులతో వాతావరణం బీభత్సంగా వుంది.

అసలు పడవ ఎలా వెళుతుందో కూడా ఎవరికీ తెలియడంలేదు. పడవలో వున్న వాళ్లంతా వర్షంలో తడిసి ముద్దయి పోయారు. వర్షానికి ఏ ఈదురు గాలులు వేగంగా వీస్తున్నాయి. ఈదురు గాలుల వేగం ఎంత భయంకరంగా వుందంటే ఆ శబ్దాలకి చెవులు చిల్లులు పడిపోతాయేమో అనిపిస్తోంది. దూరంగా ఒడ్డున కొబ్బరిచెట్లు తలలు వాల్చేసిన దెయ్యాల్లా అటూ ఇటూ ఊగిపోతున్నాయి. హరీంద్రతో సహా పడవలో వున్న వాళ్లంతా తొందరపడి ఎందుకు ప్రయాణం చేస్తున్నాంరా భగవంతుడా అనుకొంటూ తమని తాము తిట్టుకొంటున్నారు. ఇంతలో ఆకాశంలో ఎవరో డైనమైట్లు పేల్చిన భయంకరమైన చప్పుళ్లు. ఆ శబ్దాలకి పడవలో వున్నవాళ్లంతా హడలిపోయారు. చాలామందికి ప్రాణాలు పైపైనే పోయాయి. అందరూ గజగజా వణికిపోతున్నారు. కొంతమంది భయానికి ఒకర్నొకరు గట్టిగా కౌగలించుకున్నారు.

వాతావరణ బీభత్సానికి గోదావరి ఒడ్డున పుట్టి పెరిగిన ఆ పడవ నడిపే బెస్తవాడిక్కూడా ఒళ్లు జలదరిస్తోంది. ప్రయాణీకులందర్నీ క్షేమంగా అవతలి ఒడ్డుకు చేరుస్తాననే నమ్మకం అతడికి కనిపించడంలేదు. పడవ గోదారి మధ్య వరకు వచ్చింది. ఇంకా సగం దూరం ప్రయాణం చెయ్యాలి. గోదావరిలో అలలు ఎగిరెగిరి పడుతున్నాయి. ఆ అలల వేగానికి పడవ అటూ ఇటూ ఊగుతోంది. గోదావరి మధ్యలో ఒక పెద్ద ఇసుక దిబ్బ వుంది. పడవ ఇసుక దిబ్బ ప్రక్కనుంచి దూసుకుపోతోంది. అంతవరకూ ధైర్యంగా వున్న హరీంద్ర కూడా ప్రకృతి బీభత్సాన్ని చూసి భయం వేసింది. ఎందుకైనా మంచిది, ముందు జాగ్రత్త చర్యగా పడవని ఇసుక దిబ్బ ప్రక్కని ఆపేస్తే మంచిదేమో అనిపించింది హరీంద్రకి. వాతావరణం శాంతించేవరకు పడవని ఇక్కడ ఆపేయడం మంచిదని బెస్తవాడితో కూడా చెప్పాడు.

అయితే వీళ్లద్దరి సంభాషణ ఇంకా పూర్తికాకుండానే వున్నట్లుండి ఒక అల పెద్దగా పైకి లేచింది. ఆ అల వేగానికి ప్రయాణీకులంతా భయపడి ఒక ప్రక్కకి చేరిపోయారు. ప్రయాణీకులంతా ఒక ప్రక్కకి ఒరిగిపోవడంతో పడవ బ్యాలెన్స్ తప్పి తల్లక్రిందులైంది. కన్ను తెరిచేలోగా ఘోరం జరిగిపోయింది. రక్షించండి... రక్షించండి అంటూ ప్రయాణీకులు అరిచే అరువులు ఆ గాలివాన హోరులో కలిసిపోతున్నాయి. నిజానికి అంతమంది ప్రయాణం చేస్తున్నా ఆ పడవలో ఈత వచ్చింది కేవలం ఇద్దరికే. పడవ నడిపే బెస్తవాడికి, హరీంద్రకి తప్ప ఇంకెవ్వరికీ ఈత రాదు. ఈత విద్యలో ఇద్దరూ ఒకరిని మించిన వాళ్లు ఒకరైనా బెస్తవాడికి ఆ సమయంలో తన ప్రాణాలు కాపాడుకోవడం మినహా అనవసరమైన రిస్క్ తీసుకోవాలనిపించలేదు. బ్రతికుంటే గోదావరిలో చేపలు తిని బ్రతకొచ్చు మనకెందుకొచ్చిన గొడవ అనుకొంటూ వేగంగా ఈదుకొంటూ అక్కడి నుంచి చల్లగా జారుకున్నాడు.

ప్రమాదాన్ని ముందే పసిగట్టిన హరీంద్ర అప్పటికే ఎలెర్ట్‌గా వున్నాడు. ఆ సమయంలో అతను ఇంకేం ఆలోచించలేదు. అందినవాళ్లని అందినట్టు జుట్టు



పెట్టుకొని ఇసుక దిబ్బమీద పడేస్తున్నాడు.

అతని పరిస్థితి పద్మవ్యూహంలో అభిమన్యుడిలా వుంది. ముందు ఎవరిని కాపాడాలో తరువాత ఎవరిని రక్షించాలో అతనికి అర్థం కావడంలేదు. ప్రాణభయంతో అందరూ వచ్చి అతని మీద పడుతున్నారు. నీటిలో చేపపిల్ల కన్నా వేగంగా కదులుతూ అతను కదనరంగంలోని సైనికుడిలా చొచ్చుకుపోతున్నాడు. అప్పటికే హరీంద్ర పదిమంది ప్రాణాలు కాపాడి మిగతా వారిని రక్షించడానికి నీటిలో అన్వేషిస్తున్నాడు. మిగతా మనుషులు ఏమైపోయారో అతనికి కనిపించడంలేదు. నీటిలో మునిగిపోయి వుంటారనుకొంటూ అతను జలాంతర్గామిలా నీటి లోపలికి ప్రవేశించాడు.

నీటిపైన ఈదడం కన్నా నీటి లోపల ఈదడం చాలా కష్టం. ఎవరూ కనిపించడంలేదు. మరింత లోపలకి ప్రవేశించాడు. ఏవేవో పిచ్చిమొక్కలు, తీగెలు కాళ్లకు, చేతులకు తగులుతున్నాయి. కాని మనుషులు మాత్రం ఎవరూ కనిపించడంలేదు. అతని ఒంట్లో శక్తి పూర్తిగా హరించుకుపోయింది. ఇక ఈదడానికి కూడా ఓపికలేదు. పరిస్థితి వేజారక ముందే బయటపడటం మంచిదనుకొంటూ అతను నీటిపైకి వచ్చేస్తున్నాడు. తీగెలు, తీగెలుగా వున్న మొక్కలు ఏవో అతని కాళ్లకు చుట్టుకొన్నాయి. ఆక్టోపస్‌లా వున్న ఆ తీగెలు అతని కాళ్లని పూర్తిగా చుట్టేసాయి. చేతులతో ఆ తీగెల్ని విడిపించడానికి ఎంత ప్రయత్నం చేసినా ఫలితం కనిపించడంలేదు. వాటితో పోరాడి, పోరాడి అతను పూర్తిగా ఓడిపోయాడు. పది మంది ప్రాణాలు కాపాడగలిగాడు కాని తన ప్రాణాన్ని మాత్రం రక్షించుకోలేకపోయాడు.

మర్నాడు ఉదయం గోదావరిలో మునిగిపోయిన మిగతా ఐదుగురి మృతదేహాలతో పాటు హరీంద్ర మృతదేహం కూడా నీటిపై తేలింది. పదిమంది ప్రాణాలు కాపాడిన అమరవీరుడు అంటూ పత్రికలు ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించాయి. ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్‌తో సహా అనేకమంది ప్రముఖులు హరీంద్ర ధైర్య సాహసాలను వేనోళ్ల కొనియాడి తమ నివాళులర్పించారు. పదిమంది ప్రాణాలు కాపాడి ఎక్కడైతే తన ప్రాణాలు పోగొట్టుకున్నాడో ఆ గోదావరి ఒడ్డునే అతని అంత్యక్రియలు నిర్వహించారు. గోదావరి ఒడ్డున పుట్టి పెరిగి గోదారి తల్లిని విపరీతంగా ప్రేమించే హరీంద్రని గోదావరి తనలో ఐక్యం చేసేసుకొంది. ◆

